తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# పేదరిక నిర్మూలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

**-రాష్ట్ర ప్రభరి అధికారి సచింద్ర కుమార్ పట్నాయక్**



కాణిపాకం, జనవరి 24 ప్రభాతవార్త: పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని వికసిత్ భారత్ సంకల్పయాత్ర రాష్ట్ర ప్రభరి అధికారి సచింద్రకుమార్ పట్నాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులందరికీ ఈపథకాలు అందించేందుకు వీలుగా మండలంలోని వడ్రాంపల్లెలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్రప్రభరిఅధికారి సచింద్రకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరిస్తూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓటి.లక్ష్మి,ఆర్డీఓచిన్నెయ్య, మాజీ రాజ్య సభ సభ్యురాలు దుర్గారామకృష్ణ,ఎంపీడీఓనాగరాజు, వ్యవసాయశాఖ ఏడీ మధుసూధన్‌రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కెవి.చంద్ర మోహన్, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి భాను ప్రకాష్, మండల అధ్యక్షుడు ఎం.కుమార్, జిల్లా ఎస్సీ మోర్చాకోశాధికారి శ్రీనివాసులు,మండల ప్రధాన కార్యదర్శి పరదేశి,రమణ,పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'వికసిత్' విజయవంతం

## ఇప్పటి వరకు 646 పంచాయతీల్లో యాత్ర పూర్తి - కలెక్టర్ సగిలి షన్మోహన్



వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి, పరిశీలకులు సచింద్రకుమార్ పట్నాయక్, కలెక్టర్ సగిలి షన్మోహన్‌లు

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర 646 గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకొని విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ సగిలి షన్మోహన్ జిల్లా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రత్యేక అధికారి, పరిశీలకులు సచింద్రకుమార్ పట్నాయక్‌కు వివరించారు. జిల్లా సచివాలయంలోని సమావేమందిరంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణపై కలెక్టర్ సగిలి షన్మోహన్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో జిల్లా వికసిత్ భారత సంకల్ప యాత్ర పరిశీలకులు సచింద్రకుమార్ పట్నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023 నవంబర్ 25వ తేదీన జిల్లా కేంద్రం చిత్తూరు నుండి వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 646 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అలాగే ఈ నెల 30వ తేదీలోపు మిగిలిన 51 గ్రామ పంచాయతీల్లో సంకల్ప యాత్రను పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఈ సంకల్ప యాత్రను జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకొని విజయవంతం చేశారన్నారు. అలాగే జిల్లాలో ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి 4,75,170 కార్డులకు ఇకెవైసి పూర్తి చేయడం జరిగిందని, పిఎం గరీబ్ కళ్యాణ్ యోజన కింద 17,16,898 యూనిట్స్ పూర్తి చేయడం జరిగిందని, అంత్యోదయ యోజన కింద నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా 878 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జిల్లా పరిశీలకులు, ప్రత్యేక అధికారి సచింద్ర కుమార్ పట్నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, కార్యక్రమ నోడల్ అధికారి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఏ పిడి డిఎంకె తులసీ, హౌసింగ్ పిడి పద్మనాభం, డ్వామా పిడి గంగా భవానీ, సాంఘీక సంక్షేమశాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, డిఎస్ఓ శంకరన్, డిఎల్‌డిఏ రవికుమార్, డిఐసి జిఎం చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డిఇఓ విజయేంద్రరావు, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ షణ్ముగరామ్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకే

# ఇంగ్లీషు మీడియం

**ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించటానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, ఇందులో భాగంగానే ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను ఒక హక్కుగా భావిస్తూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర ముఖ్య మంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం తిరుపతిలో ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన విద్యా సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొని, ప్రసంగించారు. విద్యా, వైద్యం, పరిపాలన రంగాల్లో తాము తీసుకొచ్చిన పెను మార్పులు పేదరిక నిర్మూలనకు, అవినీతి రహిత పారదర్శక పాలనకు నిదర్శనం అన్నారు. వైకాపా మానిఫెస్టోలో పొందుపరిచిన 99.5 శాతం హామీలు నెరవేర్చామని, తమ ప్రభుత్వానికి వున్న విశ్వసనీయతను ప్రశ్నించే హక్కు ఏ పార్టీకి లేదన్నారు. నాణ్యమైన చదువుతోనే పేద విద్యార్థులు పేదరికాన్ని జయించగలుగుతారని, సంపన్నులకు మాత్రమే అందే నాణ్యమైన చదువును పేద విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఎంతో ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్ళుతున్న తమ ప్రభుత్వ లక్ష్యాన్ని కొందరు పెద్దలు పని గట్టుకుని విమర్శలు చేయడం బాధాకరం అన్నారు. ఆరోవ తరగతిపైబడి వున్న 60వేల తరగతి గదులలో ఐఎఫ్‌పి ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఫిబ్రవరి నెలాఖరుకు ఈ కార్యక్రమం పూర్తయితుందన్నారు. సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్‌ను మూడోవ తరగతి నుండి అమలు చేస్తున్నామని, ఉపాధ్యాయులలో బోధనా సామర్థ్యాన్ని పెంచుతున్నామన్నారు. రాష్ట్ర రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ జాతీయ కాంగ్రెస్ పార్టీ చెత్త రాజకీయాలను ప్రోత్సహిస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. గతంలో తమ కుటుంబంలో చీలిక తెచ్చిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం తన చెల్లినే తనపై పావుగా ప్రయోగిస్తుందని, డర్టీ పాలిటిక్స్ కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని ఏద్దేవా చేశారు.

# మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్ అడ్డగింత

## మంచినీటి బిల్లులు చెల్లించాలని వైఎస్సార్సీ శ్రేణుల ఆందోళన !!



మంత్రి కారును అడ్డుకుంటున్న వైఎస్సార్సీ శ్రేణులు

వి.కోట, జనవరి 24 ప్రభాతవార్త

రాష్ట్ర అటవీ,గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సొంత పార్టీ శ్రేణుల నుంచే నిరసన సెగ తగిలింది. మంచినీటి బిల్లులు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేస్తూ మంత్రి కాన్వాయ్‌కు అడ్డంగా నిలబడ్డారు. అనంతరం కారు ఆపిన మంత్రి ఎంత మేర బిల్లులు రావాలో వివరాలు అందించాలని పేర్కొంటూ బయలుదేరారు. ఈసంఘటన వి.కోట పట్టణంలో చోటు చేసుకుంది. పలమనేరు నియోజకవర్గంకు సంబంధించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన వైకాపా శ్రేణులు, కార్యకర్తలు పలువురికి దాదాపు ఇరవై కోట్ల దాకా ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉందని సమాచారం. బిల్లుల కోసం వీళ్ల ఎక్కడెక క్కడికి తిరిగినా ఫలితం లేకుండా పోయింది. గత నాలుగున్నర ఏళ్లుగా బిల్లులు రాకపోవడంతో వీరు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు.

పలువురు అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు వాపోయారు. ఈ నేపథ్యంలో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి కుప్పంకు కారులో వస్తుండగా ఒక్కసారిగా పోలీసులనుంచి తప్పించుకుని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద రోడ్డుపైకి వచ్చి మంత్రి కారుకు అడ్డంగా నిలబడ్డారు. దీంతో మంత్రి తన కారును నిలిపి వారితో మాట్లాడారు. ఒక్కసారిగా పలువురు రోడ్డుపై వచ్చి అడ్డు నిలబడడంతో మంత్రి అసంతృప్తికి లోనయ్యారు. పూర్తి వివరాలు తెలియజేస్తే బిల్లులు అందేలా చూస్తామని చెప్పి కారులో కుప్పం వైపు వెళ్లిపోయారు.

## చిట్టమూరులో

# అమానుషం

## ఆరేళ్ల చిన్నారిని హత్య చేసి చెరువులో పడేసిన వైనం

చిట్టమూరు, జనవరి 24 ప్రభాతవార్త



అభంశుభం తెలియని ఆరేళ్ల వయస్సు ఉన్న ఓ చిన్నారిని కర్కశంగా చంపి చెరువులో పడేసిన ఘటన బుధవారం చిట్టమూరులో చోటుచేసుకుంది. ముక్కుపచ్చలారని గుర్తుతెలియని చిన్నారి ఇలా చిట్టమూరు గ్యాస్ గోదాము సమీపంలోని చెరువులో విగతజీవిగా పడి ఉండటాన్ని చూసిన స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్నారి తలను గుడ్డతో చుట్టి నోట్లో సైతం గుడ్డలు కుక్కి మరీ హతమార్చడం వెనుక మిస్టరీ ఏమై ఉంటుందని చిట్టమూరు ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. చిట్టమూరు చెరువులోకి బహిర్భూమికి వెళ్లిన యువకులు అక్కడ చిన్నారి మృతదేహం ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐలు లక్ష్మీభవాని సంఘటన స్థలానికి చేరుకొని చిన్నారి ఆచూకీ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి మృతి తల్లిదండ్రుల దౌర్భాగ్యమా లేక ఎవరైనా క్షుద్రపూజలు జరిపి ఇలా చేశారా, పిల్లలను ఎత్తుకొని పోయే వారి పనేనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కారకులను కఠినంగా శిక్షించాలని చిట్టమూరు మండల ప్రజలు కోరుతున్నారు.

## మృత్యువులోనూ

# వీడని బంధం

## తమ్ముడి మరణ వార్త విని అన్న మృతి !!



కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త

మృత్యువులోను ఇద్దరు అన్నదమ్ములు తమ బంధంను వీడలేదు. తమ్ముడు మృతి చెందాడన్న వార్త విని తట్టుకోలేక అన్న గుండె ఆగిన సంఘటన కుప్పం పట్టణంలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. కొత్తపేటలో రంగస్వామి, గోవిందస్వామిలు అన్నదమ్ములు. వీరి నివాసాలు కూడా కొంత దూరంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గోవిందస్వామి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అన్న రంగస్వామి సైతం తీవ్ర ఆందోళనకు లోనై తనువు చాలించాడు. కాగా బాధిత కుటుంబాలను తెదేపా నేతలు పరామర్శించారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అంత్యక్రియల కోసం పదివేల వంతున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యుడు కె. కన్నన్, మైనార్టీ నేత అన్సర్‌బాషా, యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు, బూత్ ఇన్‌చార్జులు ఉదయ్‌కుమార్, మణి, కృష్ణ, మురళి, రాహుల్‌కుమార్, భరత్, తిరుమగళ్ పాల్గొన్నారు.

# టిడిపిలోనే బిసీలకు పెద్దపీట

**- నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ మురళీమోహన్**



జయహో బిసీ సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ మురళీమోహన్, పాల్గొన్న బిసీలు.

బంగారుపాళ్యం, జనవరి 24 ప్రభాతవార్త: బిసీలు తెలుగుదేశం పార్టీకి పట్టుకొమ్మలాంటి వారని పూతలపట్టు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ మురళీమోహన్ అన్నారు. బుధవారం సాయంత్రం బంగారుపాళ్యంలో జయహో బిసీ కార్యక్రమంను మండల టిడిపి పార్టీ చేపట్టింది. స్థానిక పార్టీ కార్యాలయం నుండి సమావేశ స్థలం వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బిసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బిసీ కులాలకు రాజ్యాధికారం టిడిపి అందించిందన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ బిసీల సంక్షేమం పలు కార్యక్రమాలను చేపట్టి పార్టీలో సముచిత స్థానం కల్పించారన్నారు. అనంతరం నారా చంద్రబాబునాయుడు పలు సంక్షేమ పథకాలను బిసీలకు అందించారని అందులో ముఖ్యంగా ఆధరణ, బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు తదితరాలు వున్నాయన్నారు. ప్రస్తుత వైకాపా ప్రభుత్వం బిసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు మంజూరు చేయలేదని గుర్తు చేశారు. కార్పొరేషన్ కార్యాలయాల్లో కుర్చీలు, బల్లలు మాత్రమే వున్నాయన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పి జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, పార్లమెంటు టిడిపి కార్యదర్శి కోదండ యాదవ్, బిసీ నాయకులు నాగరాజు గౌడు, కవి, జానకిరామయ్య, హరిప్రసాద్, జాకీర్, ఎగ్గిడి భాస్కర్, రఘుపతి, చంద్రశేఖర్, మునిరత్నం, గిరిబాబులతో పాటు మండల జనసేన అధ్యక్షుడు కోడి చంద్రయ్య, కార్యదర్శి బాలు, మాజీ జడ్పీటిసీలు మహేంద్ర, కోదండయ్య, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్లు హేమ చంద్రనాయుడు, వాసుదేవనాయుడు, మాజీ సర్పంచ్ చందు, ఉప సర్పంచ్ లోకనాధనాయుడు, బివిరెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## జనావాసాలలో దూసుకెళ్తున్న

# ఇసుక ట్రాక్టర్లు

## భయం గుప్పెట్లో తిరుచానూరు గ్రామస్తులు

తిరుచానూరు, జనవరి 24, ప్రభాతవార్త



తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరులో ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా ప్రయాణిస్తూ స్థానికుల వెన్నులో వణుకుపుట్టిస్తున్నాయి. గతంలో ఇసుక తరలించే ట్రాక్టర్లు ప్రధానమార్గాల ద్వారా ప్రయాణించేవి అయితే ప్రస్తుతం తిరుచానూరు తిరుమాడ వీధులలోస్థానికులు, చిరువ్యా పారులుతో చాలా సందడి వాతావరణం కలిగి ఉంటుంది. ఆ ప్రాంతంలో అధికంగా పాదాచారులు, సైకిళ్ల ద్వారా చిన్న పిల్లలు,వృద్ధులు, గోవులు,ద్విచక్రవాహనాల ద్వారా అధికంగా ప్రయాణిస్తుంటారు. ఇలాంటి జనావాస ప్రాంతాలలో ఇసుకతో కూడిన వాహనాలు పోటాపోటీగా ఎవరో తరుముతున్నట్లుగానో లేక ఎక్కువ సార్లు ఇసుక ట్రిప్‌లు తరలించాలనే ఉద్దేశంతోనో వేగంగా ప్రయాణిస్తూ స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తు న్నారు. ఇదే క్రమంలో కొనసాగితే రాబోయే రోజులలో పెద్ద పెద్ద ప్రమాదాలతో గ్రా ప్రజలకు ప్రాణహాణి కలిగే ప్రమాదం వుంది. ఇప్పటికైనా స్థానిక పోలీసు అధికారులు ఇసుక తరలించే ట్రాక్టరు యజమానులకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ద్వారా వారి దారిని మరల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సత్వరం ఎన్నికల విధుల కమిటీల నియామకాలు పూర్తి

**- రెండు రోజుల్లో పోలింగ్ కేంద్రాల మరమ్మత్తు పనులు**

**- కలెక్టర్ సగిలి షన్మోహన్**

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సజావు ఎన్నికల నిర్వహణ కోసం వివిధ కమిటీల నియామకాలను గురువారం సాయంత్రంలోపు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న మరమ్మత్తు పనులను ఈ నెల 27వ తేదీలోపు పూర్తి చేసి ఆప్లోడ్ చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరం నుండి బుధవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆర్ఓలు, ఈఆర్ఓలు, సహాయ ఎన్నికల అధికారులు, ఎంపిడిఓలతో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావు నిర్వహణ కోసం ఎంసిసి కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టేట్ సర్వైలెన్స్ కమిటీ, వీడియో సర్వలెన్స్ కమిటీ, వీడియో వ్యూయింగ్ కమిటీలను గురువారం సాయంత్రంలోపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంసిసి కమిటీ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేయడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ, మండలాలు, మున్సిపల్ ప్రాంతాల్లో వుండేలా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల వారీగా నియామకాలు వుండాలని ఎంపిడిఓలు లేదా ఇఓపిఆర్డీలు సభ్యులుగా వుండాలని, మున్సిపల్ ప్రాంతాల్లో అసిస్టెంట్ కమీషనర్లు సభ్యులుగా వుండి పోలీసులను ఇందులో చేర్చడం జరుగుతుందన్నారు. చిత్తూరు అర్బన్ పరిధిలో రెండు, గ్రామీణ పరిధిలో ఒకటి, అలాగే మిగిలిన మున్సిపల్ ప్రాంతాల్లో ఒకటి, మండల ప్రాంతాల్లో ఒకొక్కటి వుండాలన్నారు. అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ప్రతి నియోజకవర్గానికి మూడు బృందాలు వుండాలని, ఈ బృందాల్లో డిప్యూటీ తహసిల్దారు లేదా సీనియర్ ఆర్ఐ, ఏఆర్ఐ, వీడియో గ్రాఫర్, అర్మడ్ మెన్ వుంటారని, వారిని సత్వరం ఎంపిక చేయాలన్నారు. అలాగే స్టేట్ సర్వలెన్స్ టీమ్‌లో మండల మేజిస్ట్రేట్, ముగ్గురు పోలీసులు వుండేటట్లు ఒక నియోజకవర్గానికి మూడు బృందాలు వుండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, జిడినెల్లూరు ఆర్ఓ భవానీ, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, ఎస్ఎస్ఏ పిఓ వెంకటరమణారెడ్డి, డిఎల్‌డిఓ రవికుమార్, ఎస్‌డిసి శివయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

# అంతరాలయ దర్శనం టిక్కెట్టు రూ.500లు

## అమలుకు సన్నాహాలు: మరో వివాదానికి తెర తీసిన పాలన



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త

ఇప్పటికే దళారులతో గందరగోళంగా మారిన శ్రీకాళహస్తీశ్వరుని పాలనకు ఆలయాధికారులు మరో వివాదానికి తెర తీసారు. అంతరాలయ దర్శనానికి టిక్కెట్టు ఖరారు చేసారు. స్వామి అమ్మవార్ల ఆలయ అంతరాలయ దర్శనాలకు రూ.500లు ఖరారు చేసి ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశిస్తూ ఇఓ ఆదేశాలు జారి చేసారు. ఈ అంశానికి సంబంధించి దేవాదాయశాఖకు ఓ లేఖ పంపుతూ భక్తుల సౌకర్యార్థం, అందరికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాలు కల్పించుటకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఇఓ సిబ్బందికి ఆర్‌సి నెంబర్ ఏ 2/296/2023 తేది 20.01.2024 ద్వారా ఆదేశించారు. దేవాదయాశాఖ ఉత్తర్వులు కె.డిస్ నం. డి.డిస్.నెం డి2/సిఓఇ 14027(37)/9/2023 తేది 16.01.2024 మేరకు అమలుకు రామారావు చర్యలు తీసుకున్నారు.

**ఇది సాధ్యమా?**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇప్పటికే దళారుల అడ్డదారుల దర్శనాలు,ఎన్ని నిబంధనలు విధించినా అమలు చేయలేని వైనం. అంతేకాక రాహుకేతుదోష నివారణ మండపాల్లో దళారుల సామ్రాజ్యంగా మారింది. ప్రత్యేక దర్శనటిక్కెట్లు ఏర్పాటు చేసారు.ఇందులో గోల్‌మాల్. ఇక్కడి ఆలయంలో దళారులకు రాజమార్గం.టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి సవాలక్ష నిబంధనలు.పరిశీలనలు. అయితే ఆలయ పర్యవేక్షకులు, ప్రోటోకాల్ ఎఇఓలు ప్రేక్షకులుగా మారారు. ఎవరిని ఆపితే ఏం వివాదాలు, దౌర్జన్యాలు ఎదుర్కోవాల్సి వస్తుందో అని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.దాంతో సామాన్యభక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు శివయ్య దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షిస్తుంటే అడ్డదారి దళారులు దర్జాగా తీసుకెళుతుంటే తమ మూగరోదన శివయ్యకే అప్పగిస్తున్నారు.ప్రస్తుతం స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనానికి రూ.500లు టిక్కెట్టు ఖరారు చేసారు.ఇప్పటికే శివయ్యకు చెందాల్సిన సొమ్ములనుదళారులు అంతరాలయ దర్శనం పేరుతో జేబులు నింపుకుంటున్నారు.అలాంటి వారికిఇది చెక్ అవుతుంది.కానీ ప్రతి ఒక్కరు అంతరాలయ దర్శనంకు వస్తే ఏర్పాటు చేయటం సాధ్యమా? అనేది అధికారులు గమనించాలి. ఇక విఐపిలు టిక్కెట్లు కొనుగోలు చేస్తారా?ఇలాంటి అంశాలకు సంబంధించి అధికారులు పాలకమండలి సలహాలు తీసుకుంటే బాగుంటుంది.కానీ ఇఓ ఏకంగా ఏర్పాట్లుకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులకు ఉత్తర్వులు జారి చేసారు. ఆలయ బాధ్యులకు సమాచారం అందించారు.

## మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైకాపాలో చేరిక

రామకుప్పం, జనవరి 24 ప్రభాతవార్త



రామకుప్పంకు చెందిన పలువురు యువకులు బుధ వారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా వారిని మంత్రి పార్టీ కండువాలు కప్పి సాదర ంగా ఆహ్వానించారు. కుప్పంలో ఎమ్మెల్సీ ్ర భరత్ గెలుపుకు కృషి చేస్తామని యువత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, కేశవరెడ్డి, చెంగారెడ్డి, మంజునాథరెడ్డి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.



## అన్నదాన ప్రసాదానికి విరాళం

బోయకొండ(చౌడేపల్లి), జనవరి 24 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండపై అన్నదాన ప్రసాదానికి రూ. 50వేలు విరాళంగా అందించారు. బుధవారం ఆలయ ఛేర్మన్ నాగరా జరెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరుకు చెందిన నారాయణరెడ్డి, కళావతి దంపతులు ఇఓ చంద్రమౌళికి నగదునందించారు. వారికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించి, పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## సహకారబ్యాంకుల్లో ఖాతాదారులవ్వండి

-ఆకట్టుకొన్న కళాజాత

చౌడేపల్లి, జనవరి 24 ప్రభాతవార్త

జిల్లా కేంద్రీయ సహకార బ్యాంకుల్లో ఖాతాదారులవ్వాలని కళాజాత ఆధ్వర్యంలో ఎఫ్ఎల్‌సి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక డిసిసిబ్యాంకు సమీపంలో జరిగిన కళాజాత బృందంచే జీరో బ్యాలన్స్ అకౌంట్, రూపేకార్డు, రూ. 2లక్షల ప్రమాదభీమా, ఘర్ ఘర్ కె.సి.సి అభియాన్, రైతులకు పంటరుణాలు, జనసురక్ష వంటి పథకాలను గురించి అవగాహన కల్పించారు. డిసిసి బ్యాంకు మేనేజర్ వెంకటేష్‌బాబు, సూపర్ వైజర్ వెంకట్రమణ, కళాజాత సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చౌడేపల్లి, జనవరి 24 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారిలో పలమనేరు నుంచి వస్తున్న స్కూటర్ చిట్రెడ్డిపల్లి నాగులరాళ్ళ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కూటర్ లో ప్రయాణిస్తున్న చిట్రెడ్డిపల్లికి చెందిన వ్యవసాయ కూలీ సీతప్ప(65) తీవ్ర గాయాలపాలయ్యాడు. గుర్తించిన చుట్టుపక్కల వారు గాయపడ్డ అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే సీతప్ప మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా చదళ్ళకు చెందిన ఎన్‌విఆర్ ట్రస్టు అధినేత వేణుగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద మృతుడు సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## క్రీడలతోనే ఆరోగ్య సమాజం ఆవిష్కరణ

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:



క్రీడలతోనే ఆరోగ్య సమాజం ఆవిష్కరించబడు తుందని, ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడలో ప్రావిణ్యత సాధించి ఆ మేరకు ఆరోగ్యంగా వుండాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలు పునిచ్చారు. చిత్తూరు మెసానికల్ గ్రౌండ్స్‌లో బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. ఈకార్యక్రమంలోవైకాపా నాయకులు, కార్యక్తలు, డిఎస్ఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ఎస్ఆర్‌పురం, జనవరి 24 ప్రభాతవార్త:



ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలని ఎంటి రాజు ప్రతాప్ అన్నారు. రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించే కార్యక్రమంలో భాగంగా బుధవారం పిళ్ళారికుప్పం గ్రామంలో జీవామృతం తొట్టె నిర్మించారు. ఈ తొట్టెలో దేశవాళి ఆవుమూత్రం, గోమయం ద్విదళ ధాన్యాల పిండి, బెల్లం సమపాళ్ళలో కలిపి జీవామృతం చేయడంతో భూమిలో ఉత్ప్రేరకాలు పెరుగుతాయని ఎంటి రాజప్రతాప్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి సురేష్, రామకృష్ణ, ఐసిఆర్‌పిలు మోహన్‌రెడ్డి, సౌందర్య, భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పదవులను అమ్ముకొనే మంత్రి రోజా రాజీనామా చేయాలి

- జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు పులివర్తినాని డిమాండ్

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:

సొంత పార్టీ నాయకుల నుండి డబ్బులు తీసుకొని పదవులు ఇస్తున్న మంత్రి రోజా సత్వరం తమ మంత్రి పదవికి రాజీనామా చేయాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా దేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర పార్టీ నాయకులు వెంకిటీల సురేంద్రకుమార్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్‌లు డిమాండ్ చేశారు. స్థానిక నేతలకు పదవుల ఆశ చూపి మంత్రులు వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, మంత్రి రోజా అనుచరులు పుత్తూరు మహిళా కౌన్సిలర్ నుండి 40 లక్షలు కాజేశారని ఆమె స్వయంగా చెప్పారని, అలాగే మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం 70 లక్షలు మంత్రి రోజా డిమాండ్ చేశారని వారు ప్రకటనలో ఆరోపించారు.

## బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

చిత్తూరురూరల్, జనవరి 24 ప్రభాతవార్త:

బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బిజెపి సీనియరు నాయకులు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. పట్టణంలోని కస్తూరిబా గాంధీ పురపాలిక బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం బాలికల విద్య, ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధి కోసం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. . ఆడపిల్లల లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి బేటీ బచావో బేటీ పడావో, సుకన్యసమృధ్ధి యోజన వంటి పథకాలను తీసుకొచ్చిందని విద్యార్థినులకు వివరించారు. పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు భారతి, బిజెపి నాయకులు రామభద్ర, బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు ఆంధ్రరాణి, స్వరాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడు రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

సదుం, జనవరి 24 ప్రభాతవార్త



మండల పరిదిలోని అమ్మగారిపల్లె పంచాయతీ కలకటవారిపల్లెకు చెందిన సి.రమేష్‌రెడ్డి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబీకులను ఓదార్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి, ధర్మవరం నియోజకవర్గం పరిశీలకులు అయిన పెద్దిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కరరెడ్డి, సదుంపంచాయతీ ఉపసర్పంచి బాబురెడ్డి, సురేం ద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతుల గుర్తింపుకే ఆడుదాం ఆంధ్ర పోటీలు

ఎంపిపి అనిత లోకేష్

గంగాధర నెల్లూరు జనవరి 24 ప్రభాత వార్త:

ప్రతిభావంతులకు గుర్తింపునకే ఆడుదాం ఆంధ్ర పోటీలను మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్నారని ఎంపిపి అనిత లోకేష్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో నియోజక వర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను అనిత స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవిలు ప్రారంభించారు. ఈ పోటీలు ఈ నెల 29వ తేదీ వరకు నిర్వహించ బడతాయని ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఓ, సుధాకంర్, ఎంఇఓ ఆంజనేయులు శెట్టి, వైస్ ఎంపిపి హరిబాబు స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్‌లతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ,అధికార సిబ్బంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## శాంతిపురం తహశీల్దార్‌గా కృష్ణకుమార్

శాంతిపురం, జనవరి 24 ప్రభాతవార్త



శాంతిపురం మండల తహశీల్దార్‌గా కృష్ణకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు కుప్పం ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా పనిచేశారు. తాజాగా శాంతిపురం తహశీల్దార్‌గా నియమితులయ్యారు. మండలంలో రెవె న్యూ సమస్యల పరిష్కారంకు తనవంతు చొరవ చూపుతానని ఆయన ఈసంద ర్భంగా పేర్కొన్నారు.

## మంత్రి రోజాను బర్తరఫ్ చేయాలి

- తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ

కుప్పంరూరల్, జనవరి 24 ప్రభాతవార్త



పదవులు ఇప్పిస్తామని లక్షలు వసూలు చేసుకున్న మంత్రి రోజాను బర్తరఫ్ చేయాలని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా నేతలు సుగుణమ్మ, స్వాతి, గీతమ్మలతో కలసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదవులు అడ్డుపెట్టుకుని కార్యకర్తలకు పదవులు అమ్ముకోవడంపై సిఎం జగన్ స్పందించాలన్నారు. దళితుల వద్ద నగదు వసూలు చేసిన రోజాకు మంత్రిగా ఉండే అర్హత లేదన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జిజెఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాలోకేష్ జన్మదిన వేడుకలు

చిత్తూరురూరల్, జనవరి 24 ప్రభాతవార్త:



తెలుగుదేశంజాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేష్ జన్మదినోత్సవాన్నిమంగళవారంజిజెఎంఛారిటుల్‌ట్రస్ట్, తెలుగుదేశంనాయకులతో కలసి గురజాల జగన్మోహన్ పలు సేవాకార్యక్రమాలను చేపట్టారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలోరోగులకుఅల్పాహారం, పండ్లు,బ్రెడ్‌పం చిపెట్టారు. శ్రీ కామాక్షి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు, తరువాత జరిగిన రక్తదాన శిబిరంలో సుమారు 200మంది రక్తదానంచేసారు. మధ్యాహ్నం పిసిఆర్ సర్కిల్‌లో అన్నదానం, పార్టీ కార్యాలయంలో500మందిపార్టీ క్రియాశీల కార్యకర్త లకు హెల్మెట్లను, తోపు డుబండ్లనుజగన్‌మోహన్‌పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలోఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవు లనాయుడు, నేతలు దొరబాబు, చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, కఠారి హేమలత, బద్రీనారాయణ, కోదండయాదవ్, మోహన్‌రాజ్, సుబ్రమణ్యంనాయుడు, హేమాద్రినాయుడు, అశోక్‌లతోపాటుడివిజన్‌నాయకు లు, బూత్ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు వెలగడం లేదని జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు

తవణంపల్లె, జనవరి 24 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పొన్నేడుపల్లెలో వీధిదీపాలు వెలగడం లేదని టీడీపీ నాయ కులుబుధవారం జడ్పీసీఈఓను కలసి ఫిర్యాదు చేశారు. మోదలపల్లె పంచాయతీ పొన్నేడుపల్లెలో మంగళవారంరాత్రి మండల టీడీపీ నాయకులు పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో వీధిదీపాలు వెలగక పోవడాన్ని గుర్తించి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం జడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డిని కలసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షబ్బీర్‌అలి, నాయకులు జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బిసీలందరికి సమన్యాయం చేసిన ఘనత టీడీపీదే

ఐరాల, జనవరి 24 ప్రభాతవార్త:

బిసీలందరికి సమన్యాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని ఆపార్టీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి కలికిరిమురళీమోహన్ అన్నారు. బుధవారం నాంపల్లెలో టీడీపీ, జనసేనల సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జయహో బీసీ కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చే టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లాప్రధానకార్యదర్శికోదండయాదవ్, నియోజవర్గ పరిశీలకుడు శ్రీధర్, మండల అధ్యక్షుడు వడ్లపాటి గిరిధర్‌బాబు, మాజీ జడ్పీటీసీ ఎం.లత, నాయకులు కాణిపాకం బాలకృష్ణ, దయానందమండడిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం టిక్కి రాయల్ దరఖాస్తు

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:



చిత్తూరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు టిక్కి రాయల్ బుధవారం దరఖాస్తు చేసుకొన్నారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం టిక్కి రాయల్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, ఎఐసిసి జనరల్ సెక్రటరీ మాణిక్యం ఠాగూర్‌ను కలిసి చిత్తూరు నుండి పోటీ చేయడానికి దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా టిక్కి రాయల్ కాంగ్రెస్ మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కెవిపి రామచంద్రారావును కలిసి ఆయన ఆశీస్సులు తీసుకొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలకు సత్వరం భూమి గుర్తింపు

- కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త:

జర్నలిస్టులకు ఇళ్ళ పట్టాల మంజూరుకు సంబంధించి సిపిఆర్ నుండి ఇప్పటి వరకు అందిన జాబితా మేరకు జిల్లాలో అవసరమైన భూమిని రెవెన్యూ అధికారులు హౌసింగ్ కమిటీలోని మీడియా సభ్యులను సమన్వయం చేసుకొని త్వరితంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశమందిరంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆధ్వర్యంలో డిఆర్ఓ రాజశేఖర్‌తో కలిసి జర్నలిస్టుల ఇంటి పట్టాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు సిపిఆర్ వెరిఫికేషన్ జాబితా మేరకు 311 మంది జర్నలిస్టులు వున్నారని, ఇందుకు సంబంధించి రెవెన్యూ వెరిఫికేషన్ సైతం త్వరితంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎంపిపి భాస్కర్‌రెడ్డికి రాజ్యలక్ష్మి పరామర్శ



బాలాయపల్లి, జనవరి 24, ప్రభాతవార్త

గత కొంతకాలంగా అనారోగ్యంతోబాధపడుతున్న ఎంపిపిగూడూరు భాస్కర్‌రె డ్డిని మాజీ మంత్రి నేదు రుమల్లిరాజలక్ష్మిబుధవారంపరామర్శించారు. జయం పులోని ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడి గితెలుసుకున్నారు. అలాగే వెంగమాంబపురానికి చెంది న సూదులగుంట వీరప్పనాయుడు కూడా ఆమె పరామర్శించారు. పిగేలాంతదితరగ్రామాలకువెళ్లిపలువురినిఆమెకలుసుకున్నారు. దాదాపు పది సంవ తరాల తర్వాతఆమెగ్రామాలకురావడంతోఅందరూఆప్యాయంగాపలకరించారు. ఆమెవెంటసర్పంచ్ బి.వెంకటసుబ్బ య్య తదితరులున్నారు.

## 29న టిడ్కో గృహాల ప్రారంభం

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



వెంకటగిరి, జనవరి 24, ప్రభాతవార్త

ఈ నెల29న వెంకటగిరిలో నిర్మితమైన టిడ్కో గృహాల సముదాయాన్ని మంత్రుల చేత ప్రారంభిస్తా మని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. గృహాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను రామ్ కుమార్ రెడ్డిజిల్లాగ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్‌దొంతుశారద, అధికారులు పరిశీలించారు. గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకాన్నిఏర్పాటు చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేఆనంనారాయణ రెడ్డి ప్రోటోకాల్‌నిబంధనలు పాటించలేదని తెలిపారు. ప్రోటోకాల్‌లో తన పేరు నాలుగోదిగా ఉండాల్సి ఉండగా ఎక్కడ పేరు పెట్టేవాడు కాదని తెలిపారు. తాను ఆయన పేరు కూడా పెట్టిస్తానని చెప్పారు. ఆయన వెంట కమిషనర్ వెంకటరామయ్య, ఈఈ ఉమా శంకర్ శాస్త్రి, డిఈ రంగయ్య, ఏఈ కోటేశ్వర రావు, వైసిపి నాయకుడు సురేష్ రెడ్డి, డిల్లీ బాబు, తదితరులు ఉన్నారు.

## పంట నమోదు వేగవంతం చేయండి

- జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్



చిట్టమూరు, జనవరి 24 ప్రభాతవార్త

రబీ 2024సంవత్సరానికి గాను విఎఎలుఅందరూ పంట నమోదును వేగ వంతంగాపూర్తిచేయాలని తిరు పతిజిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం చిట్టమూరుమండలం యాకసిరి, అరవ పాలెం, కోగిలిరైతుభరోసాకేంద్రాలపరిధిలోఆయన పర్య టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట నమోదు వల్ల బహుళ ప్రయోజ నాలు ఉన్నందున పంట వేసిన ప్రతి రైతును సర్వేనంబర్ల వారీగా పంట నమోదులో పొందుపరచాలని విఎ ఎలకుసూచించారు. అనంతరంఅరవపాలెంలో ఈ-క్రాప్ సూపర్‌చెక్‌లో భాగంగా రైతు పోచారెడ్డి గిరీష్‌రెడ్డి పంట పొలాన్ని పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్ వెంట నాయుడుపేట ఎడిఎ ఉమా, వ్యవసాయాధికారిసుచేంద్రప్రసాద్, అరవపాలెం, కోగిలి, యాకసిరివిఎఎలుసునంద, దివ్యజ్యోతి, అరుణఉన్నార

## జయహో బిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

చిట్టమూరు, జనవరి 24 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం బిసిలకు చేస్తున్న అన్యాయంపై గురువారం చిట్టమూరు టిడిపి కార్యాలయంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు పేర్కొన్నారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్, గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

## క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడమే ఆడుదాం- ఆంధ్ర లక్ష్యం

గూడూరు, జనవరి 24, ప్రభాతవార్త

గ్రామీణ స్థాయి నుండి ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గూడూరు ఎంపిడిఓ వెంకటేశ్వర రావు వెల్లడించారు. గూడూరులో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్ మ్యాచ్లు హోరా హోరీగా జరిగాయి. ఈ కార్యక్రమంలో క్రీడా పోటీలకు ఆర్డినేటర్ శివ, వాకాడు ఎంపిడిఓ గోపీనాథ్, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తో మహేంద్రరెడ్డి భేటీ

గూడూరు, జనవరి 24 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధ వారం రేణిగుంట విమానాశ్ర యంలో జగనన్న సేవాసమితి అధ్యక్షులు, వైసీపీ సీనియర్ నేత ఊటుకూరు మహేంద్రరెడ్డి, జడ్పీటిసిసభ్యురాలు ఊటుకూరు యామినిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ము చ్చటిస్తూఏం మహేంద్రరెడ్డి, యామినిరెడ్డి ఎలా ఉన్నారు, గూడూరు ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. గూడూరు నియోజక వర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాయుడుపేట, జనవరి 24 ప్రభాతవార్త



మండల పరిధిలోని పండ్లూరు సమీపంలోని స్వర్ణముఖి నది కాజ్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. నెల్లూరుకు చెందిన దొడ్డపనేని మదన్‌మోహన్‌నాయుడు నెల్లూరు నుంచి నాయుడుపేటకు మోటార్‌బైక్‌లో వస్తుండగా, స్వర్ణముఖి నదికాజ్‌వేవద్దలారీఢీకొంది. ఈప్రమాదంలోమదన్‌మోహన్ నాయు డు తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రఘునాథ్ సంఘ టన స్థలానికిచేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఆసరా పేరుతో మహిళలకు కుచ్చుటోపీ - నెలవల

సూళ్లూరుపేట, జనవరి 24 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలు సమీపిస్తు న్న నేపథ్యంలో ఆసరా పేరుతో మహిళలకు కుచ్చుటోపీ పెట్టేందుకుసిద్ధమయ్యారని మాజీ ఎంపీ, తెలుగుదేశం నియోజ కవర్గఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానికటిడిపికార్యాలయంలోఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసరా పథకం పేరుతో 79 లక్షల డ్వాక్రా మహిళలకు ఆర్థిక సహాయం చేస్తు న్నట్లు ప్రకటనలు జారీ చేశారన్నారు. మహిళలపై కపట ప్రేమ చూపుతూ పైగా సాధికారత సాధించామని గొప్పలు చెప్పున్నారని నెలవల విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమా ళ్లు, ఎజికిషోర్, బుద్ధివిజయలక్ష్మి, మంజుల, అలవలశ్రీనివాసరావు, బట్టాసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో బిసి సదస్సు

సూళ్లూరుపేట, జనవరి 24 ప్రభాతవార్త



సూళ్లూరుపేట తెలుగుదేశం కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బిసి సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల అభ్యున్నతి కోసం పాటుపడింది తెలుగుదేశం పార్టీయే అని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో బిసిలకు రాజకీయంగా గుర్తింపు తెచ్చింది ఎన్‌టిఆర్ అని, అదే స్ఫూర్తితో చంద్రబాబునాయుడు పనిచేస్తూ పార్టీలో బిసిలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మన్ పళణి, చిట్టేటి పెరుమాళ్లు, ఆకుతోట రమేష్, బుద్ధి విజయలక్ష్మి, ఎస్ఎన్ మునిరాజా, సిహెచ్ రమణయ్య, సెల్వం, యోగేశ్వరరావు, అలవల శ్రీనివాసరావు, పచ్చా మాధవనాయుడు, బట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆసరా పెద్ద టోకరా

మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, జనవరి 24, ప్రభాతవార్త



వైఎస్ఆర్ ఆసరా పథకం ఒక పెద్ద టోకరా పథకమని గత టిడిపి ప్రభుత్వంలో కోటి 24 లక్షల మంది మహిళలు ఉంటేఇప్పుడు 50 లక్షల మంది డ్వాక్రా మహిళలను తగ్గించారని గూడూరు టిడిపి మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆరోపించారు. గూడూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంవచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివకుమార్, కోటీశ్వర రావు, సురేంద్రబాబు, చిరంజీవి, సునీల్, భారతి, శివ, పాల్గొన్నారు.

## పల్లెల్లో దోమల బెడద

- కనుమరుగవుతున్న పారిశుధ్యం - పట్టించుకోని అధికారులు

దొరవారిసత్రం, జనవరి 24 ప్రభాతవార్త



స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలు కనుమరుగవుతున్నాయి. ప్రభు త్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ఎన్నో వి ధానాలను అమలు చేస్తున్నా గ్రామస్థాయిలో ఎక్కడ కూడా అవి పాటించిన దాఖలాల్లేవు. దొరవారిసత్రం మండల పరిధిలో 22 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో ఎక్కడ కూడా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన దాఖలాలు లేవని పలువురు వాపోతున్నారు. దీనికితోడు పల్లె ప్రాంతాల్లో ఉన్న గుంటలు, కాలువల్లో మురికినీరు ఉండటంతో అక్కడ దోమల లార్వా పెరిగి దోమలు ఉత్పత్తి పెరుగుతోంది. పేరుకే సంబంధిత అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని అంటున్నారే గాని ఎక్కడ కూడా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పూర్తిగా బాగు చేసిన దాఖలాలు లేవని పలువురు అంటున్నారు. గత పదిరోజుల నుంచి అక్కరపాక, పోలిరెడ్డిపాలెం, నెలబల్లి, నెల్లూరుపల్లి, తనయాలి, బూదూరు తదితర గ్రామాల్లో దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికే పల్లెల్లో తీవ్రమైన జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై బిటిఏ ఆందోళన

కోట, జనవరి 24 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల జాప్యం చేయడానికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు స్థానిక ఎంపిడిఓ భవానికి, తహశీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రద్దు చేసిన పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, 11వ పిఆర్‌సి, డిఎ అరియర్స్ 7,382 కోట్లు వెంటనే విడుదల చేయాలని, గత సంవత్సరం ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న వెయ్యి కోట్లకు పైగా పిఎఫ్ లోన్లు పార్ట్ ఫైనల్ పేమెంట్ వెంటనే చెల్లించాలని, గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న 4,500 కోట్లు సరెండర్ లీవుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ఎస్ఆర్‌పురం, జనవరి 24 ప్రభాతవార్త:



జిడినెల్లూరు నియోజకవర్గ సమస్యలను రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరీ దృష్టికి తీసుకెళ్ళినట్లు జిడినెల్లూరు నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు రాజేంద్ర పేర్కొన్నారు, విజయవాడలోని రాష్ట్ర బిజెపి కార్యాల యంలో బుధవారం నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్ర గావ్ ఛలో అభియాన్ ప్రశిక్షణ కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వ రీని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో వికసిత్ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన వైనంను ఆమెకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె రాజేంద్రతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడానికి పక్కాగా కృషి చేయాలని సూచించారు.

## తెదేపా నేతలచే మృతులకుటుంబాలకు ఆర్థికసాయం



కుప్పం, జనవరి 24 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధిలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు తరపున ఆ పార్టీ నేతలు ఒక్కో కుటుంబంకు పదివేల వంతున ఆర్థికసాయం అందించారు. మున్సిపల్ పరిధి బాబునగర్‌లో సంజయ్, రాజమ్మ, శారదమ్మ, శరవణ కుటుంబాలకు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ చేతుల మీదుగా ఆర్థికసాయం అందించారు. కార్యక్రమాల్లో నేతలు సత్యేంద్రశేఖర్, రవి, ఉమాపతినాయుడు పాల్గొన్నారు. అలాగే 16,17వార్డుల్లో చంద్ర, వెంకటరమణ, కుమార్, మునెప్పనాయుడులు మృతి చెందగా వారి కుటుంబాలకు దేశం నేతలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు ఆర్ముగం, మంజునాథ్, ఆర్ఆర్ రవి, వేణు, శ్యామసుందర్, అప్పు తదితరులు పాల్గొన్నారు.

## వరదయ్యపాలెం ఎస్ఐగా ప్రతాప్ బాధ్యతలు స్వీకరణ

**వరదయ్యపాలెం, జనవరి 24, ప్రభాతవార్త**

వరదయ్యపాలెం మండలం సబ్ ఇన్స్పెక్టర్‌గా ప్రతాప్ బుధవారం బాధ్యతను స్వీకరించారు. అనంతరం ఎస్ఐ ప్రతాప్ మాట్లాడుతూ వరదయ్యపాలెం సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతను స్వీకరించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాని తెలిపారు. అదే విధంగా ఇసుక, మట్టి, మద్యం, అక్రమ రవాణా చేస్తే వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరదయ్యపాలెంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి ఉంచి నివారించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఆర్‌టిసి డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి

**శ్రీకాళహస్తిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఏర్పేడుమండలంలోని సరిహద్దుల్లో పల్లాం పేటలో బుధవారం ఓ ఆర్‌టిసి డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి చేయగా ఆసుపత్రి పాలైన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు బాధిత డ్రైవర్ ఆర్‌వి కుమార్ శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇలా ఉన్నాయి. వెంకటగిరి నుంచి తిరుపతికి బయలుదేరిన ఆర్‌టిసి బస్సు పల్లాం పేట వద్దకు రాగా వెనుక వస్తున్న ఆటోకు సైడ్ ఇవ్వలేదని ఘర్షణ పడ్డారు. అయితే ఆర్‌టిసి బస్సు తిరుపతి వెళ్ళి తిరిగి రాగా పల్లం పేట వద్ద ఆటో డ్రైవర్ మరో గుర్తుతెలియని పదిమందితో అక్కడ సిద్దంగా ఉన్నాడు. బస్సును ఆపి డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. దాంతో ఆర్‌వి కుమార్ మోహంపై గాయాలు కాగా ఆతను వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి వైద్య సదుపాయం కోసం చేరారు. ఇక్కడ ఆతని వాంగ్మూలాన్ని వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసారు. బస్సును ఏర్పేడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు జరుగుతుంది.

## రజక పాదయాత్రకు ఘనస్వాగతం

**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్‌లోని రజకులను ఎస్‌సిలలో చేర్చాలని ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొని జీఓ విడుదలచేయాలని కోరుతూ గత కొంత కాలంగా రాష్ట్ర రజకులు ప్రభుత్వాలను కోరుతున్నారు. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ రజక సంఘం తమ డిమాండ్ల సాధనకు 'ఎస్‌సి సాధన కమిటిని' ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటి సారధ్యంలో తిరుపతి నుంచి విజయవాడ వరకు పాదయాత్ర నిర్వహించి ఏ ఏ ప్రాంతాల్లో రజకుల పరిస్థితి ఏమిటి? ఆయా ప్రాంతాల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? ప్రభుత్వాలు అందిస్తున్న వెసులుబాట్లు అమలు తీరును తెలుసుకొనుటకు పాదయాత్రను నాగమల్లేశ్వరరావు మిత్ర బృందం తిరుపతి నుంచి ప్రారంభించి బుధవారం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చేరుకున్నారు. ఇక్కడ ఆంధ్ర ప్రదేశ్ రజక ఐక్యత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం సారధ్యంలో భారీ స్వాగతం ఏర్పాటు చేసారు. పాదయాత్ర విజయవంతం కావాలని నినాదాలు చేసారు. హక్కులను సాదించే శక్తిని ఆందోళన చేస్తున్న బృందానికి ఇవ్వాలని శివయ్యను కోరుకకుంటూ నాగమల్లేశ్వరరావును దుశ్శాలువతో సత్కరించారు.

## బాలికలు భయాందోళనలు వీడాలి

**తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త**



బాలికలు భయాందోళనలు వీడి చదువుపై దృష్టిసారించి నేటి కంప్యూటర్ ప్రపంచ యుగంలో విద్యార్ధినులు పోటీతత్వాన్ని అలవరచుకుని చదువుకోవాలని ఉషోదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాల.ఉష అన్నారు. మండలంలోని బసవయ్యపాళెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలికల మధ్య కేక్‌కట్‌చేసి చాకెట్లు పంపిణీచేశారు. అనంతరం విద్యార్ధులకు పలకలు, పెన్సిళ్ళు, పెన్నులు బహూకరించారు. ఈసందర్భంగా ఉష మాట్లాడుతూ ఒకప్పుడు ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందని ఆనందించే వారనీ, కానీ నేడు ఆడబిడ్డ అనగానే మనసులో ఏదో తెలియని బాధ ఉంటుందని ఆక్షణమే నిట్టూర్చుతున్నారని తెలిపారు. నేటి సమాజంలో తల్లికడుపులో పెరుగుతున్న ఆడపిల్ల అని తెలిస్తే ఆడశిశువును అంతమొందిస్తున్నారని ఇది నేరమని తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు చివరిరోజుల్లో వారిని చూసుకుని వారికి అన్నంపెట్టేది ఆడబిడ్డే అన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.సుమలత, ఎస్.కె.మొబీన్, రేవతి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

**తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త**



జగనన్న ఇండ్లును రిజిస్ట్రేషన్లు చేసుకోవడం కోసం గ్రామ సచివాలయాల్లోనే ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు పెట్టనుంది. ఈమేరకు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఓ, డిజిటల్ అసిస్టెంట్లకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ విజయభాస్కర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని 101 రెవెన్యూ గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు కేవలం జగనన్న ఇండ్లకు సంబందించి మాత్రమే చేస్తారని స్పష్టం చేశారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, కెవిబిపురం, తొట్టంబేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాలకు చెందిన వారికి శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

## మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ద స్కూల్ విద్యార్ధుల ప్రతిభ

**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త**



మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల నిర్వహించిన జాతీయ స్థాయి సైన్సు ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్ధులను కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్ధులు సుమారు 45మంది గణిత ఒలింపియాడ్ రెండోస్థాయికి అర్హత సాధించారన్నారు. 3వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్ధులకు బంగారు పతకాలు సాధించారన్నారు. 3వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్ధులు మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్గొన్నారని వీరిలో సుమారు 35మంది విద్యార్ధులు బంగారు పతకాలు సాధించారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉత్తమ కళాదర్శకత్వ షార్ట్‌ఫిల్మ్‌గా రంగస్థలంలో..

ఉత్తమకళా దర్శకత్వ షార్ట్ ఫిలింగా రంగస్థలంలో..ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కళా దర్శకత్వ విభాగంగా ఉత్తమ కళా దర్శకుడిగా ఈరంగస్థలంలో అనే షార్ట్‌ఫిల్మ్‌కి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఫిబ్రవరి 4న మహతి ఆడిటోరియంలో జరుగబోయే కార్యక్రమంలో అత్యుత్తమ పురస్కారం దక్కింది. ఈసందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రారెడ్డిలు తెలిపారు. ఈ షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు సన్‌మురళీ, చాయాగ్రహం చందు, డిఐ విశ్వనాథ్‌లు శ్రీకాళహస్తి వాసులు గర్వకారణం కావడం గర్వంగా ఉందని తెలిపారు.

## సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలి

**శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త**



సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పుస్కరించుకుని మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడబిడ్డలు ఎదుర్కొంటున్న అన్ని అసమానతలను ముఖ్యంగా లింగవివక్షతను నిర్మూలించడంపై అవగాహన కల్పించారు. ఐక్యూ కన్వీనర్ డాక్టర్ సి.బాపనయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించడానికి మహిళలకు ఉన్న అవకాశాలు వాటిని అందిపుచ్చుకోవడానికి సాయం చేసే వివిధ సంస్థల గురించి వివరించారు. చరిత్ర అధ్యాపకురాలు రుద్రమదేవి బాలికా దినోత్సవ విశిష్టతను వివరించారు. నేటి సమాజంలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, ఫిజిక్స్ అధ్యాపకురాలు డాక్టర్ రామసుహన్న, ఎవి.సుభాషిణి, డాక్టర్ రమేష్‌బాబు, విద్యార్ధినీ విద్యార్ధులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్‌వి క్యాంపస్ స్కూల్ నందు జాతీయ బాలిక దినోత్సవం

**తిరుపతి కార్పొరేషన్, జనవరి 24, ప్రభాతవార్త**

ఎస్‌వి క్యాంపస్ స్కూల్ నందు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎస్. జయలక్ష్మి, దిశా ఎస్ఐ శివాజీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి శివశంకర్, కళాశాల హెడ్ మిస్ట్రెస్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా జాతీయ బాలికల దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ఎస్. జయలక్ష్మి మాట్లాడుతూ బాలల యొక్క హక్కులు, చట్టాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, మిషన్ వాత్సల్య సిబ్బంది కల్పన, దేవయాని పాల్గొన్నారు.

## సత్యవేడు సిఐగా దివాకర్‌రెడ్డి

**సత్యవేడు, జనవరి 24, ప్రభాతవార్త:**

సత్యవేడు నూతన సిఐగా దివాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన శివకుమార్‌రెడ్డి నంద్యాల రూరల్ సిఐగా బదిలీ అయ్యారు. దీంతో శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న దివాకర్‌రెడ్డిని సత్యవేడు సిఐగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సత్యవేడు, వరదయ్యపాళ్యెం, నాగలాపురం మండలాల్లో ఇసుక, మట్టి, మద్యం అక్రమ రవాణా చేస్తే వారిపై కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు.

## బాలికల పట్ల లింగ వివక్ష చూపరాదు

**నగరి, జనవరి 24 ప్రభాతవార్త:** బాలికల పట్ల లింగ వివక్షత పాటించడం అనైతికం, ధర్మ విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నా వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందంజలో ఉన్నారన్నారు. రక్షణ, అంతరిక్షం, సాఫ్ట్‌వేర్, విద్య, వైద్యం, క్రీడలు మొదలకు అనేక రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని తెలియజేశారు. వారిలోని తెలివి తేటలను సమాజానికి ఉపయోగపడేలా చేయూతనిస్తే సమాజం సర్వతో ముఖంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. భాస్కర్‌రాజు వృక్ష శాస్త్ర అధ్యాపకులు అరుణకుమారి, ఆంగ్లధ్యాపకులు రేవతి, తెలుగు అధ్యాపకులు డా. సి.చిన్నపాపమ్మ,డా.స్వాతి, ఉమా మహేశ్వరి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదవులను అమ్ముకునే రోజాకు మంత్రిగా అర్హత లేదు

**వడమాలపేట, జనవరి 24 ప్రభాతవార్త:**

పదవులను అమ్ముకునే రోజాకు మంత్రి పదవిలో కొనసాగే అర్హత లేదని చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, వడమాలపేట మండల ప్రధాన కార్యదర్శి హేమావతి విమర్శించారు. వారు బుధవారం వడమాలపేటలో విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ పదవి కోసం కౌన్సిలర్ భువనేశ్వరిని 70 లక్షలు డిమాండ్ చేసి 40 లక్షలు తీసుకున్న మంత్రిరోజాను వెంటనే మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌కి చిత్తశుద్ధి ఉంటే దళితులను మోసం చేసిన రోజాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

## మంగళం జడ్పి హైస్కూల్‌లో ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

**తిరుపతి కార్పొరేషన్, జనవరి 24, ప్రభాతవార్త**



జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని డిఎంహెచ్‌ఓ డా. యు శ్రీహరి, డిపిఎంఓ శ్రీనివాసులు, డిఈఎంఓ ఐసి బాబు నెహ్రూ రెడ్డి మంగళం జడ్పి హైస్కూల్ నందు జాతీయ బాలికల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. బాలికల ఆరోగ్యంగా ఉండడానికి మంచి పోషకాహారం తీసుకోవాలని వారు క్రీడలలో చురుకుగా పాల్గొనాలని సమాజంలో బాలికల పై జరుగుతున్న ఆగాయిత్యాలను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని సమాజంలో మంచి గుర్తింపు పొందాలని తెలిపారు. అ ఆటపాటలలో రాణించిన వారికి బహుమతులు అందజేసారు. పిల్లలందరికీ చాక్లెట్లు పంచిపెట్టారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను జాతీయ బాలికల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు.

## కులమతాలకు అతీతంగా అర్హతే ప్రమాణికం

**మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శం**

**'వై ఏపి నీడ్స్ జగన్" సంక్షేమ పథకాల వివరణ**

**ఎంఎల్ఏగా ఆశీర్వదించండి .. మరింత అభివృద్ధి చేస్తా..!**

**తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

**చంద్రగిరి, జనవరి 24 ప్రభాతవార్త:**



కులమతాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికి లబ్ది చేకూర్చుతూ ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిలిచారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. చంద్రగిరిలో బుధవారం వై ఏపి నీడ్స్ జగన్, మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా చంద్రగిరిలో పలు ప్రాంతాలలో వైసిపి పతాకావిష్కరణలు గావించారు. ముఖ్యమంత్రి ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను, ప్రయోజనాలను వివరించారు. అనంతరం మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ యావత్ దేశానికే ఆదర్శమన్నారు. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఎంత అప్పు వున్నా ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మూడు విడతలు చెల్లించి, ప్రస్తుతం నాలుగో విడత చెల్లింపుతో మాటతప్పని ముఖ్యమంత్రిగా నిలిచిపోయారని కొనియాడారు. ఏడాది పొడవునా చెవిరెడ్డి కుటుంబం మీకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. పండుగలకు, పెళ్ళిళ్ళకు నేనున్నాంటూ నాతండ్రి చేసిన, చేస్తున్న సేవలను కొనసాగించడానికి తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చు - శ్రీనివాస్

**రేణిగుంట, జనవరి 24 ప్రభాతవార్త:**



క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నివారించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా. శ్రీనివాసులు అన్నారు. రాష్ట్రీయ సేవా సమితి, పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు ఆదేశానుసారం రేణిగుంట మండలం చైతన్యపురం ఎస్టీ కాలనీలో రాస్ మహిళా జ్యోతి, టాటా ట్రస్టు శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ ఆస్పత్రి, పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బీ అండ్‌సీ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు డా. వెంకయ్య బాబు, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, అమరావతి, రమేష్‌రెడ్డి, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ప్రొఫెసర్ హైమావతి, ట్రస్టు ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, అన్బలగన్, జ్యోతి, నాగమణి స్వాతి, ఇంధుమతి, శంకరయ్య, క్లస్టర్ లీడర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షత సాంఘిక దురాచారం - డాక్టర్ తేజస్విని

**రేణిగుంట, జనవరి 24 ప్రభాతవార్త:**



బాలికలను చులకన చేస్తూ లింగ వివక్షత చూపడం సాంఘిక దురాచారమే కాకుండా చట్టరీత్యా క్షమించరాని నేరమని డాక్టర్ తేజస్విని అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రాథమిక వైద్యాధికారి డా. ఛత్రప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజస్విని మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ ఆశయ సాధనలో భాగంగా బాలికలను కాపాడి వారిని చదివించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధనం, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అధికారులు హైమావతి, ఉషారాణి, అనురాధ, పద్మావతి, జన విజ్ఞాన వేదిక రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు గృహ సందర్శనాల భాగంగా మర్రిగుంటకు చెందిన ఓ బాలిక ఉదరంలో బద్దె పురుగులు ఉండడానికి గుర్తించి ఆ అమ్మాయిని రుయా చిన్న పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె పొట్ట నుంచి వైద్యులు సుమారు రెండు మీటర్ల పొడవున్న బద్దె పురుగులను బయటకు తొలగించారు.

## జనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలను డిఎల్‌డివోకు వినతి పత్రం

**వరదయ్యపాలెం, జనవరి 24, ప్రభాతవార్త**



వరదయ్యపాలెం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నా మండలంలోని పలు ప్రధాన సమస్యలను డిఎల్‌డిఓ వెంకట శేషయ్యకు విన్నవించారు. మండల కేంద్రం వరదయ్యపాలెంలో డ్రైనేజీ సమస్య, గోవర్ధనపురం మారేడు కాలువపై వంతెన, గోపాలరావుకాలనీలో అంతర్గత రోడ్లు, మౌలిక వసతులు, 133 కేవీ విద్యుత్ లైన్లు మార్పు, జడ్పి ఉన్నత పాఠశాలకు మైదానం వసతి, వర్షాలకు రాకపోకలు స్తంభించే ఆరుదూరు సిఎల్ఎన్ పల్లి, కడురు క్రాస్ వద్ద వంతెనల నిర్మాణం, రహదారులకు ఇరువైపుల ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ సమస్య, చిన్నపాండురు అపోలో కంపెనీ భూబాధితులకు పరిహారం, ప్రభుత్వ భూముల స్వాధీనం, స్మశానాలకి దారి వసతి, స్మశానాలకి స్థలం కేటాయింపు, వంటి పలు సమస్యల పై వినతి పత్రం అందించి పరిష్కారానికి చొరవ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిడిఓసుబ్రమణ్యం, ఎంపిపిభర్తదామోదర్‌రెడ్డి, జడ్పిటిసి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా విశ్వవిద్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవం

**తిరుపతి మహిళావర్సిటీ, జనవరి 24, ప్రభాతవార్త**

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రొఫెసర్ సి. వాణి మాట్లాడుతూ ఆడపిల్లలు ఆలోచన ధోరణి మార్పు చేసుకోవాలని అన్ని రంగాలలో ముందడుగు వేయాలని, ఎంచుకున్న రంగాలలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని కోరారు. బాలికల కోసం ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి. ఉమాదేవి మాట్లాడుతూ మహిళా సాధికారత తోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేసారు.

# తిరుపతి డివిజన్

## వేదాంతపురంలో తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు భూమి పూజ

**తిరుపతిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు బుధవారం భూమిపూజనిర్వహించారు. విజయనగర్ కాలనీ, రాం ధాస్ కాలనీలలో ప్రజల దాహార్తిని తీర్చటానికి రూ.10లక్షల తుడ నిధులతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వేదాంతపురం సర్పంచ్ చెరకుల జనార్ధన్‌యాదవ్ మాట్లాడుతూ పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చటానికి పైపు లైన్‌ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ ంలో పంచాయతీ కార్యదర్శి ఎ.గిరిధర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు..

## ఫ్లెక్సీలు ఏర్పాటు- వైసిపి నాయకులపై కేసు నమోదు

**తిరుపతిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త:**



ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారనే కారణంతో ముగ్గురు వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైనట్లుసమాచారం. తిరుపతిరూరల్ మండలం గాంధీ పురం పంచాయతీలో అధికారపార్టీకి చెందిన ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయడంతో సదరు పంచాయతీ కార్యదర్శి వారిపై కేసు నమోదుకు సిఫారసు చేసారు. పంచాయతీలోని ఎం.శివ, గురవారెడ్డి, జైకర్‌లపై కేసు నమోదుకు ఈఓపిఆర్డీ ముత్యాలరెడ్డిపల్లి లో ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గాంధీపురం పంచాయతీలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి కళ్యాణం కరుణశ్రీ హెచ్చరించారు.

## కళాకారులు సమాజ చైతన్యకారులు

**- మహిళా శిశు సంక్షేమశాఖ చైర్‌పర్సన్ వసంత**

**తిరుపతిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త:**



కళాకారులు సమాజ నిర్దేశకులని, కళాప్రదర్శనలు ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తారని బాలల సంక్షేమ సమితి, మహిళాశిశు సంక్షేమశాఖ చైర్‌పర్సన్ ఎం. వసంత తెలిపారు. అమరావతి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక సృజనాత్మకత సమితి సౌజన్యంతో రాయలసీమ జానపద సంగీత నృత్యోత్సవాలనుప్రభుత్వబాలికల వసతిగృహఆవరణలో బుధవారం నిర్వహించారు. అమరావతిఆర్ట్స్ అసోసియేషన్‌అధ్యక్షుడుపి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడు తూ కళాకారులు కళా నైపుణ్యంతో సమాజంలోని సామాజిక రుగ్మతలను పారదోలడానికి కృషి చేస్తారని తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగాకళాకారులుకోలాటం, జాతీయ సమైక్యత నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం కళాకారులనే సన్మానించి, మెమెంటోలను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పివిఎస్ రవికుమార్, కార్యధర్శి గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో 'మహా హెచ్ డీప్లస్ సిమెంట్' ప్రారంభం

**- మై హోమ్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాంబశివరావు**

**తిరుపతిరూరల్, జనవరి 24 ప్రభాతవార్త:**



రాయలసీమ మార్కెట్ కోసం తిరుపతిలో మహా సిమెంట్ 'మహా హెచ్ డీ ప్లస్'ని ప్రారంభించడం గర్వంగా ఉందని మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సాంబశివరావు అన్నారు. బుధవారం తిరుపతిలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా సిమెంట్‌ను ఎక్కువగా బహులార్థక ప్రాజెక్టులకు, రాజధానుల నిర్మాణాలకు, ప్లై ఓవర్ బ్రిడ్జినిర్మాణంలోను వినియోగిస్తున్నారనితెలిపారు. ఈ కార్యక్రమంలో మహా సిమెంట్ ప్రతినిధులు విజయవర్ధన్‌రావు, కిషన్‌రావు, శివరామ్‌ప్రసాద్, గురివిరెడ్డి పాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల ధర్నా

**తిరుపతి టౌన్, జనవరి 24, ప్రభాతవార్త**



రుయా హాస్పిటల్ వద్ద పారిశుధ్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మి కులను దోపిడి చేస్తున్న ఏవన్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని పరిపాలన భవనం ఎదుట ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షకార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి - రాధాకృష్ణలు మాట్లాడుతూఏవన్‌కాంట్రాక్టర్‌ఆగడాలుఎక్కువయ్యాయని, కార్మికులరక్తాన్ని తాగుతు న్నాడని కార్మికులపై విపరీతమైన వేధింపులకు పూనుకుంటున్నాడని ఈ సమ స్యలన్నింటిని గతంలోనే రుయా సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేకపోవడంతో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. 549 జివో ప్రకారం 215 మంది కార్మికులను రుయా పారిశుధ్య కార్మికులుగా హాస్పిటల్‌కు సరఫరా చేయాల్సి ఉండగా 90 మందితో పనులు చేయిస్తున్నారన్నారు. 16 వేల రూపాయిలు జీతం చెల్లించాల్సి ఉండగా 10 వేలు కొంతమందికి 11 వేలు కొంతమందికి ఇస్తూ కార్మికులను నిలువునా దోపిడి చేస్తున్న ఏ వన్ కాంట్రాక్టర్ 16 వేల రూపాయిలు జీతం ఇస్తున్నట్లుగా బాండ్ పేపర్ల పైన బలవంతంగా సంతకాలు పెట్టించుకుంటున్నాడని విమర్శించారు. ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డిరవి మాట్లాడుతూ ఫిబ్రవరి10లోగా లేపు సమస్యను పరిష్క రించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు మహేంద్ర, ఏఐటియుసి జిల్లా ఆఫీస్ బ్యాలెన్స్ సిహెచ్‌శివకుమార్ వైఎస్‌మనీ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, నగర నాయకులు అల్లాబక్షు, కిషోర్, పురుషోత్తం మీనా, వరలక్ష్మి, సులోచన, మునివేలు సునీల్, కవిత, రాజేందర్ రెడ్డి, పార్వతి, జ్యోతి మురళి, భాను, అనురాధమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ జగనన్నను సిఎం చేద్దాం : ఆదిమూలం

**నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త :**



త్వరలో జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి అందరం కలిసి కట్టుగా పని చేద్దామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. బుధవారం ఉదయం నారాయణవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు పెత్తందారుల మధ్య జరగనున్న ఈ ఎన్నికల్లో పేదలదేవిజయమన్నారు. అంతకుముందు వైఎస్సా ఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి అన్నాదొరై, మండల కన్వీనర ఇ.సొరకాయలు, ప్రధాన కార్యదర్శి కోనేటి బాబు, నాయకులు సాయిరవి, ఆర్‌డి ఏకాంబరం, గురుస్వామి, ఊరప్ప, గోవిందశెట్టి, దొరైరాజ్, కుప్పస్వామిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మనోహర్, దిల్లీ, మోహన్, అయ్యప్ప, ఆరుముగం, మురుగేశం, నాగూరు, రవి, సొరకాయలు పాల్గొన్నారు.

## సిఎంకు ఎమ్మెల్యే ఆదిమూలం సత్కారం

**నారాయణవనం, జనవరి 24 ప్రభాతవార్త :**



తిరుపతిలో బుధవారం జరిగిన ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొనడానికి వచ్చిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రేణిగుంట విమా నాశ్రయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం, జడ్పీఫైనాన్స్ కమిటీమెంబర్‌కోనేటి సుమన్ కుమార్‌లుకలిసి సత్కరించారు. కొద్దిసేపు సిఎం జగన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం రాజకీయ విషయాలపై చర్చించారు.

## టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.ధనపాల్

**పుత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన మాజీ ఎంపిటిసి జి.ధనపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు ఉత్తర్వులు జారీ చేశారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి రావడానికి సహాయం చేసిన పార్టీ నగరి నియోజకవర్గం నాయకుడు పోతుగుంట విజయ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీల సంక్షేమానికి టిడిపి 27 సంక్షేమ పథకాలు అమలు చేయగా, వైసిపి వాటిని రద్దు చేసి ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## అత్యాచారం కేసులో నిందితుడికి ఖైదు

**నగరి, జనవరి 24 ప్రభాతవార్త:**



మున్సిపల్ పరిధి, చింతలపట్టెడలో మంగళవారం రాత్రి జి.అరుణ్‌కుమార్ (32) అనే యువకుడు ఒక బాలికపై అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంటనే నిందితుడుని కోసం గాలింపు చేపట్టిన ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి బుధవారం నిందితుని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా జూనియర్‌సివిల్‌జడ్జివిష్ణువర్మ నిందితునికి 15 రోజుల రిమాండ్ విధించగా కోర్టు కానిస్టేబుల్ నవీన్ నిందితుని చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

# 28న కాంగ్రెస్ సభను జయప్రదం చేయండి

**-మళ్ళీ కాంగ్రెస్ రావాలని ప్రజల ఆకాంక్ష -తిరుపతిలో మాజీ ఎంపి డాక్టర్ చింతా**



తిరుపతి,జనవరి 24ప్రభాతవార్త: వందల సంవత్సరాల చరిత్ర ఉన్న పేదప్రజల పార్టీ కాంగ్రెస్ అని, రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. రానున్న ఎన్నికలకు ముందు తిరుపతిలో ఈనెల 28వతేదీ జరుపతలపెట్టిన కాంగ్రెస్‌పార్టీ సభను జయప్రదం చేయాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. "మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి"అనే నినాదంతో బుధవారం తిరుపతి నగరంలో డాక్టర్ చింతామోహన్ విస్తృతంగా ఇంటింటి పర్యటన చేశారు. సాయంత్రం స్థానిక నాలుక్కాళ్ళమండపం వద్ద మీడియాతో మాట్లా డుతూ పేదప్రజల్లో వైసిపి ప్రభుత్వ పాలన పట్ల గుబులు,విరక్తి మొదలైం దన్నారు. ఎస్‌సిలు, ఎస్టీలు జగన్ ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహంతో వున్నార న్నారు. గత పదేళ్ళ టిడిపి, వైసిపి పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ఎస్‌సి,ఎస్‌టి కార్పొరేషన్లకు నిధులు ఆపి దగాచేశారని ,అయోధ్య అంశంతో మైనార్టీ ప్రజలు వైసిపి,టిడిపికి దూరమ య్యారని అన్నారు. మాకాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ రావాలని, మాకు కాంగ్రెస్ దిక్కని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. బుధవారం తిరుపతి నగరంలో సంజయ్ గాంధీకాలనీ నుండి తాతయ్యగుంట కట్ట, కూరగాయల మార్కెట్ వరకు ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రవి, తిరుపతినగర కాంగ్రెస్ అధ్యక్షుడు గోపిగౌడ్, ఓబిసి విభాగం అధ్యక్షురాలు శాంతియాదవ్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూతలపట్టు ప్రభాకర్, మునిశోభ, ఎన్ఎస్‌యుఐ నాయకులు జావేద్, వెంకటేశ్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన



తిరుపతి కార్పొరేషన్, జనవరి 24 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో నేటి పరిస్థితులను పరిశీలిస్తే అభివృద్ధి చెందిన పాఠ్యాంశాలు, మౌళిక వసతులు బాగున్నాయని వివిధ రాష్ట్రాల విద్యాశాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా భోధన, అభివృద్ధి వసతులపై రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన విద్యా శాఖ అధికారుల బృందం బుధవారం తిరుపతిలోని ఎస్‌పిజెఎస్ మున్సిపల్ హైస్కూల్‌ను తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరితతో కలిసి పరిశీలించారు. తరగతి గదుల్లో భోదిస్తున్న పాఠ్యాంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హైస్కూల్ లోని తరగతి గదుల నిర్మాణాలను, మరుగుదొడ్ల పనితీరును, అదే విధంగా నోటీస్ బోర్డు ద్వారా విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న యూనిఫాం, బూట్లు, పుస్తకాలు, బ్యాగులను ఇచ్చే కేటగిరిని ప్రసంశించారు. విద్యార్థులకు అవసరమైన త్రాగు నీటి కొరకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ఆర్‌వో సిస్టమ్ పనితీరును పరిశీలించి, స్వయంగా ఆ నీటిని త్రాగి బాగుందన్నారు. ప్రతి రోజు విద్యార్థిని, విద్యార్థులకు రోజుకోక రకం అందిస్తున్న భోజనం వివరాలను బృందం తెలుసుకొని, భోజనాన్ని రుచి చూసి బాగుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పనులు ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, విద్యాశాఖ ఆర్జేడి వెంకటకృష్ణ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, ఎంఈవో బాలాజీ, హైస్కూల్ హెడ్ మాస్టర్ మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రికి ఘన స్వాగతం వీడ్కోలు





రేణిగుంట, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి బుధవారం ఘనంగా స్వాగతం వీడ్కోలు లభించాయి. తిరుపతి తాజ్ హోటల్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడానికి ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకున్నారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వచ్చారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టూరిజం, సాంస్కృతిక, యువజన క్రీడల శాఖ మంత్రి రోజా, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ విజయనందరెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రిశాంత్‌రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, జాయింట్ కలెక్టర్ శుభం జనల్స్, చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప, గురుమూర్తి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, పి.చంద్రశేఖరరెడ్డి, తిరుపతి ఎమ్మె ల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట, చిత్తూరు, సత్యవేడు, కోడూరు సంజీవ య్య, ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం, శ్రీనివాసులు, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, డిప్యూటీ మేయర్ అభియనరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమాల అనంతరం రోడ్డు మార్గంలో రేణిగుంట చేరుకుని ఆయన ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు.

# హిందూ ధర్మపరిరక్షణకు నిరంతర కృషి : ఎస్కేఆర్



చౌడేపల్లి, జనవరి 24 ప్రభాతవార్త : హిందూ ధర్మపరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పురాతన దేవాలయాల పునర్నిర్మాణదాత, బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్కె వెంకట్రమణారెడ్డి అన్నారు. బుధవారం ఎ.కొత్తకోటలో ఆయన సొంత నిధులతో నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయ స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా, పేదల వివాహాదికార్యక్రమాలకు కళ్యాణమండపాల పనులను ఆయనతోపాటు సతీమణి బోయకొండ మాజీ ఛైర్మన్ రతీదేవీరమణారెడ్డిలు పర్యవేక్షించారు. అదే విధంగా స్థానిక మృత్యుంజ యేశ్వర, కమలాంజనేయస్వామి, షిర్డీసాయిబాబా, చౌడేశ్వరీదేవీ ఆలయాలతోపాటు శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయాలను సందర్శించి విశేష పూజలు నిర్వహించారు. కుమార్‌రెడ్డి, అనిల్, జగదీష్, సుబ్రమణ్యంలు ఆయన వెంట వున్నారు.

# చిత్తూరు అభివృద్ధికి కంకణం

**- వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి**

చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: చిత్తూరు నగర అభివృద్ధికి కంకణం కట్టుకొని విధులు నిర్వహిస్తానని ఆర్టీసీ వైస్ ఛైర్మన్, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మేయర్ అముదతో కలిసి బుధవారం చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి గాంధీ రోడ్డులో 39, 40, 41, 42 డివిజన్ల పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలు చేస్తున్నారని ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు గణేష్, వెంకట్, శశికుమార్, వైకాపా నాయకులు దినేష్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలుగుదేశంతోనే బిసీలకు భద్రత

**- జయహో బిసీ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు**



చిత్తూరు, జనవరి 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం లోనే బిసీలు భద్రంగా వుంటారని, బిసీల సంక్షేమం కోసం అప్పుడు స్వర్గీయ ఎన్టీఆర్, ప్రస్తుతం నారా చంద్రబాబునాయుడు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు పేర్కొన్నారు. చిత్తూరులో బుధవారం జయహో బిసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆశావాహులు మాజీ మేయర్ కఠారి హేమలత, గురజాల జగన్మోహన్‌నాయుడు, కాజూరు బాలాజీ, సిఆర్ రాజన్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో బిసీలకు ఆధరణ, బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలతో పాటు పలు పథకాలు అందజేయడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం బిసీల సంక్షేమం కోసం అని పలు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఎలాంటి పథకాలు అమలు చేయకుండా నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. బిసీ నాయకులు సిఆర్ రాజన్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం బిసీలకు విదేశీ విద్య కార్యక్రమంను అమలు చేయడంతో పెద్ద సంఖ్యలో బిసీలు విదేశాలకు వెళ్ళి విద్యనభ్యసించి ఆర్థికంగా ఎదిగారని అయితే ప్రస్తుత ప్రభుత్వం బిసీలకు గతంలో అమలు చేస్తున్న పథకాలు అన్నింటినీ రద్దు చేసిందని ధ్వజమెత్తారు. మాజీ మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ బిసీ కార్పొరేషన్లకు ఛైర్మన్లు, పాలకవర్గాలు నియమించి వారిని ఉత్సవ విగ్రహాలను ఈ ప్రభుత్వం చేసిందని ధ్వజమెత్తారు. పలు బిసీ కార్పొరేషన్లకు కార్యాలయాలు సైతం లేదని ఆరోపించారు. రాజకీయ ఉద్యోగం కోసం ప్రభుత్వం బిసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి ఒక్క పైసా నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేశం నాయకులు వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, పెద్ద ఎత్తున బిసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎం జగన్ రాకతో...తిరుపతిలో టిడిపి నేతలు గృహనిర్బంధం

తిరుపతి,జనవరి 24ప్రభాతవార్త: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం సాయంత్రం తిరుపతి పర్యటనతో ముందస్తుగా టిడిపి నేతలను ఉదయం నుండి గృహనిర్బంధం చేశారు. సిఎం పర్యటనలో దొంగ ఓట్లపై నిరసన తెలిపే కార్యక్రమం చేపడతారన్న ముందస్తు సమాచారంతో తిరుపతి పోలీసులు టిడిపి నేతలను సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ,ఇతర నేతలను గృహనిర్బంధం చేశారు.మరికొందరిని పోలీసులు షాడో పార్టీల్లో వెంబడించారు. రాత్రి సిఎం పర్యటన ముగియగానే వారికి విముక్తి లభించింది.

# అభివృద్ధి కోసమే వెంకటగిరిని మున్సిపాలిటీ చేయించా

**మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి**



వెంకటగిరి, జనవరి 24 ప్రభాతవార్త వెంకటగిరిని అన్ని విధాలా అభివృద్ధిచేయడానికే 2005లో వెంకటగిరి పట్టణాన్ని పంచాయతీ నుండి మున్సిపాలిటీగా చేయించానని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక ఎన్‌జెఆర్‌భవనంలో మున్సిపాలిటీ సిబ్బందికి రాంకుమార్ రెడ్డితో కలిసి దుస్తులను పంపిణీ చేశారు. వెంకటగిరి పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో మున్సిపాలిటీగా చేయించినట్లు తెలిపారు. 100 కోట్ల రూపాయలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయించామన్నారు. వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. అభివృద్ధిని పరుగులు తీసే విధంగా చేస్తానని చెప్పారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద, వైసిపి జిల్లా కార్యదర్శిచిట్టేటిహరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్ కళ్యాణి, వాయిద,శ్రీనివాసరెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి, శంకరయ్య, నాయకులు దొంతు బాలకృష్ణ, మురళి కృష్ణ, సతీష్ తదితరులు ఉన్నారు.

# ఏబివిపి ఆధ్వర్యంలో 75 అడుగుల తిరంగా ర్యాలీ



గూడూరు, జనవరి 24 ప్రభాతవార్త : ఏబీవీపి సేవాభారతి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా గూడూరు పురవీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన గూడూరు రైల్వేస్టేషన్ మాస్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గణ తంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులు ఈ విధంగా తిరంగా ర్యాలీ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటా మన్నారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుండి టవర్ క్లాక్ కూడలి రాజా వీధి, కుమ్మరి వీధి మార్కెట్ మీదుగా జరిగిన తిరంగా ర్యాలీ 75 అడుగుల జాతీయ జెండాతో సాగింది. ఈ కార్యక్రమంలో ఆదిశంకర పాటశాల ప్రిన్సిపల్ రూపవతి, నారాయణ అకడమిక్ డీన్ నిఖిత, ఆర్ఎస్ఎస్ జిల్లాకళాశాల విద్యార్థి ప్రముఖులుమల్లికార్జున ఏబీవీసీ రాష్ట్ర నాయకులు చిన్న శివశంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కుక్కల దాడి నుంచి తప్పించుకున్న జింక

కోట, జనవరి 24 ప్రభాతవార్త : కోట మండలం చెందోడు గ్రామంలో బుధవారం దారి తప్పి వచ్చిన ఓ జింకను కుక్కలు తరుముకోవడంతో ఓ ఇంట్లో చొరబడింది. ఇంటి యజమాని దొడ్ల నిర్మలమ్మ ఆ జింకను కట్టేసి భద్రంగా ఉంచింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఆ మేరకు కడివేడు అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు వచ్చి ఆ జింకను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ జింక దాహార్తి కోసం వచ్చి కుక్కలు దాడి చేయడంతో గాయపడింది.

# తలకోన సిద్దేశ్వరస్వామికి విరాళాలు అందజేత



యర్రావారిపాలెం,జనవరి24 ప్రభాతవార్త : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలకోన సిద్దేశ్వరస్వామి వారికి బుదవారం పలువురు విరాళాలు అందజేశారు. నెరబైలు గ్రామానికి చెందిన దేవస్థానం మాజీ చైర్మెన్ తిమ్మాడి రఘునాధరెడ్డి స్వామి వారికి 108 వెండి రుద్రాక్షలతో కలిపిన మాలను అందజేశారు. అదే విధంగా పులిగొనుపల్లికి చెందిన వెంకటసిద్దులు ఆలయంలో అన్నదానం కొరకు 10 బస్తాల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు నాగిరెడ్డి, మంజుల, సురేష్, మధుసూధనశెట్టి, జయంత్ రాజేశ్వరి, కార్యనిర్వహణాధికారి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉపకారవేతనానికి ఎంపికైన విద్యార్థిని



సదుం,జనవరి24 ప్రభాతవార్త : సదుం మండలం జాండ్రపేటకు చెందిన దిల్‌షద్ ఆలీ కుమార్తె ఎస్.మోహసీన్ సదుంలోని జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమె గత నెల 3 వతేదీన పలమనేరులో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం పరీక్ష రాసింది. ఇందులో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ఆమె పాఠశాలలో ప్రస్తుతం 8వ తరగతి చదువుతోంది. ఆమెకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున 5 సంవత్సరాల పాటు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను అందజేస్తుంది. ఈసందర్భంగా ఆ బాలికను ప్రధానోపాధ్యా యులతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎస్వీ యూనివర్సిటీలోని... జువాలజీ విభాగంలో బర్డ్ ఫోటో గ్రఫీ ప్రదర్శన



తిరుపతి క్రీడా, జనవరి 24 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలోని జంతుశాస్త్ర విభాగం విశ్వవిద్యాలయం, తిరుపతి విద్యార్థుల విద్యా అనుభవాన్ని మెరుగు పరచడానికి ఉద్దేశించిన ఆకర్షణీయమైన బర్డ్ ఫోటో గ్రఫీ ఎగ్జిబిషన్ విజయవంతంగా ముగిసినట్లు ప్రకటించడం ఆనందంగా ఉంది. క్యాప్చరింగ్ ఫెదర్డ్ వండర్స్ పేరుతో జరిగిన ఈ ప్రదర్శనలో ప్రతిభావంతులైన ఫోటో గ్రాఫర్ వి. కిరణ్ కుమార్, డిఐజి, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ, ప్రభుత్వం యొక్క లెన్స్ ద్వారా విభిన్న ఏవిఎన్ జాతులను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ వ్యవస్థలలో పక్షుల అందం, ప్రాముఖ్యతపై ఒక ప్రత్యేక దృక్పథాన్ని అందించిన ఏపి వి. కిరణ్ కుమార్, ఏపి ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. అతను వన్యప్రాణి ఫోటోగ్రఫీని అభిరుచిగా అభివృద్ధి చేసారు. ఆంధ్రప్రదేశ్ నుండి వివిధ జాతుల అద్భుతమైన చిత్రాలను బంధించారు. నేటి ప్రదర్శనలో ఆయన 200కు పైగా పక్షి జాతులను ప్రదర్శించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని జంతుశాస్త్రత విభాగం జంతు జీవితం, ప్రవర్తన, సంరక్షణ అడవి జంతువులపై సమగ్ర అవగాహనను పెంపొందించడానికి అంకితం చేయబడింది. క్యాప్చరింగ్ ఫెదర్డ్ వండర్స్ బర్డ్ ఫోటో గ్రఫీ ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాల ద్వారా డిపార్ట్మెంట్ విద్యార్థులు, విస్తృత సమాజంలో సహజ ప్రపంచం పట్ల అద్భుతం , బాధ్యత యొక్క భావాన్ని కలిగించడం లక్ష్యంగా పెట్టుకుంది.

# శివయ్య సన్నిధిలో గోవా మంత్రి



శ్రీకాళహస్తి, జనవరి 24 ప్రభాతవార్త : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరా లయానికి గోవాకు చెందిన రాష్ట్ర మరియు పరిశ్రమలు, పంచాయతీరాజ్‌శాఖ రాష్ట్ర మంత్రి మానివ్ గొడింహోవిచ్చేశారు. ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద ఈఓ కెయస్. రామారావు స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లను ప్రత్యేకదర్శనం చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయనకు మేధా గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద మంత్రికి స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను అందించి తీర్థప్రసాదాలను చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్‌కుమార్, ఆలయ సిబ్బంది సతీష్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# గంగ కాలువకు నీటి విడుదల

**తాగునీటి దాహార్తికి, పంటలకు నీరు**



తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త : ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కంచనపల్లి, బోనుపల్లి గ్రామాల్లోని చెరువుకు తెలుగుగంగ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ తనయ బియ్యపు పవిత్రారెడ్డి అంజూరుపాళెం వద్ద సబ్‌గేట్ మూసివేసి పక్కనే ఉన్న గేట్లు తెరవడం ద్వారా కంచనపల్లి, బోనుపల్లి గ్రామంలోని చెరువులు నీటితో సమృద్ధిగా ఉండి గ్రామం లోని నీటి సమస్యలు లేకుండా మరియు పంటలసాగుబడికి, నీరు ఉపయోగపడుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో వెంటనే ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆదేశాల మేరకు కంచనపల్లి, బోనుపల్లి గ్రామాలకు చేరుకుని అక్కడ అధికారులతో గ్రామస్తుల సమస్యలపై చర్చించారు. అనంతరం అంజూరుపాళెం వద్ద ఉన్న తెలుగుగంగ కాలువ సబ్‌గేట్లు తెరవడంతో గ్రామంలోని చెరువులకు నీటిని తరలించారు. ఈసందర్భంగా రైతన్నలు చెరువుల్లో నీరు లేకపోవడంతో నీరు లేక రైతన్నలు వ్యవసాయం చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని వారి సాగుబడికోసం ఎంఎల్‌ఏను కోరడంతో కండలేరు నుంచి తెలుగుగంగ కాలువకు నీటిని విడుదల చేశారు. ఈచెరువులు నీటితో సమృద్ధిగా ఉండడంతో చుట్టుపక్కల సుమారు 520 గ్రామాలకు సాగుబడి నీరు అందుతుందన్నారు. రైతన్నలు దేశానికి వెన్నెముకగా ఉండేవారని రైతన్నకు నేడు నీరు అందించిన ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డికి మండలంలోని రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డికి, తనయ బియ్యపు పవిత్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోవి చంద్రయ్యనాయుడు, శ్రీరాములురెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, ధనంజయరెడ్డి, గణేష్, గోవిందయ్య, లక్ష్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# మార్చి 3 నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**-ఉభయదారులకు సమాచారం**



శ్రీకాళహస్తి,జనవరి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి ప్రారంభమౌతాయని ఇందుకు సంబంధించి 13 రోజుల ఉభయదారులకు దేవస్థానం సమాచారం పంపింది. ఉభయదారులు తమ ఉభయానికి సంబంధించి దేవస్థానంకు సొమ్ములు చెల్లిస్తారు ఇందుకు సమాచారం పంపారు. మార్చి 3న భక్త కన్నప్ప ధ్వజారోహణం, శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం. ఆ రోజు ఉభయదారులు బోయకులస్థులు, దేవస్థానం మార్చి 4న స్వామి వారి ధ్వజారోహణం ఉభయదారులు భయ్యా నాగమ్మ కుటుంబసభ్యులు 5న రెండవ తిరునాళ్ళు ఉభయదారులు ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పి.రమణయ్య, 6న మూడు తిరునాళ్ళు ఉదయం చిట్టా ప్రగడ తారామాంజనేయులు, సాయంత్రం జూలుగంటి సుబ్బారావు 7న నాల్గవ తిరునాళ్ళు ఉదయం పేట జనార్ధన్‌రావు,మార్చి 8న మహాశివరాత్రి పర్వదినం ఉదయం ఉభయదారులుగా వెంకటగిరి రాజావారు, యద్దనపూడి వెంకట సుబ్రమణ్యం శర్మ,సాయంత్రం కే.రంగయ్యశెట్టి,టిఎస్ రామూగుప్తా,లింగోద్భవం అభిషేకం ఉభయం దేవస్థానం, మార్చి 9న రథోత్సవం ఉభయదారులు గాజుల సత్యనారాయణ, గాజుల సరస్వతమ్మ,తెప్పోత్సవం ఉభయదారులు కె.రామచంద్రారెడ్డి,జూలుగంటి మురళి మోహన్ గుప్తా 10న కళ్యాణోత్సవం ఉదయం పిఆర్ సాయిప్రసాద్,సాయంత్రం కైకాల సంఘం, గుండు సుబ్రమణ్యం (వెంకటగిరి), 11న సభాపతి కళ్యాణం ఉభయదారులు అరుణాచల్లేశ్వర గ్రామం 12న గిరిప్రదక్షిణ ఉభయదారులు బివి సుబ్బారెడ్డి, 13న తీర్థావారి వసంత మండపం ఉభయదారులు దేవస్థానం,14న పల్లకి సేవ,15న ఏకాంత సేవ, 16న శాంతి అభిషేకాలు జరుగుతాయని దేవస్థానం పేర్కొన్నారు.

# వేడాం వద్ద కైలాసగిరుకు నిప్పు



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 24 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని కైలాసగిరుల్లో వేసవి కాలం ప్రారంభం కాకముందే అగ్ని ప్రమాదాలుచోటు చేసుకుంటు న్నాయి. ఈనేపధ్యంలో బుధవారం శ్రీకాళహస్తికి సమీపంలోని వేడాం గ్రామానికి సమీపంలోని దక్షిణ కాళిమాత ఆలయానికి పై భాగాన కైలాసగిరులకు నిప్పు అంటుకుంది. ఈ నిప్పు దావాలనంలా రాజుకుంది.అయితే దిగువన కాళీమాత ఆలయానికి సమీపంలో బిసి కాలనీ ఉంది.నిప్పులు అంటుకోవటంతో కాలనీ వాసులు భయబ్రాంతుల య్యారు. పిల్లా పాపలతో ఇళ్ళ నుంచి పరుగులు తీసారు.కైలాసగిరుల్లో చెట్లు ఏపుగా పెరగటంతో వేసవి కాలంలో కాలిపోవటం జరుగుతుంది.

# ఓటుహక్కు ప్రతిపౌరుని 'హక్కు'

**-నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం**

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, జనవరి 24 ప్రభాతవార్త : భారతీయ పౌరుడికి గుర్తింపునిచ్చేది ఓటుహక్కు. నేడు దేశంలో ఉన్న 18సంవత్సరాలు నిండిన యువతీయువకులందరికీ విధిగా ఓటుహక్కు కలిగి ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈనేపధ్యంలో ప్రతి ఏడాది జనవరి 25వతేది జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 2011నుంచి ఇది అమలులోకి వచ్చింది. మనదేశంలో ఎన్నికలు నిర్వహించే ఎన్నికల సంఘం కొత్తగా ఓటర్లను చేర్చేందుకు దృష్టిసారించింది. ఈనేపధ్యంలో ఇటీవల నూతప ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రతి ఒక్కరికి అవకాశం కలిప్తూ నగర, పట్టణ, గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులను అందజేసింది. ఈసందర్భంగా కొత్తగాఓటరు నమోదు చేసుకోవాలనుకునేవారు, ఓటరు జాబితాలో పేర్లు చేర్చుకోవడం కోసం 6ఎ ఫారంను నమోదుచేసి సమీపంలోని బిఎల్ఓకు అందించాలి. ఇక ఫారం-7లో పేర్లు తొలగించడంకు ఉపయోగించుకోవచ్చును. భారతరాజ్యాంగంలో ప్రతి పౌరుని హక్కు ఓటును ప్రాథమిక హక్కుల్లో పొందుపరచారు. నేడు కళాశాలల్లో ఉన్న విద్యార్థులు తమ పేరును నమోదుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల రెండునెలలు పాటు గ్రామాల్లో ఓటరుగా నమోదుచేసుకునేందుకు గ్రామసభలు నిర్వహించి కొత్తఓటర్లపేర్లను నమోదుచేసుకున్నారు. బిఎల్‌వోలు కాకుండా మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ నుంచి కూడా ఓటరుకు దరఖాస్తు చేసుకోవచ్చును. భారతీయపౌరుడు ప్రతి ఒక్కరు ఓటరుగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు:

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలోనే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జరీనా తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు సత్కారంతో పాటు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించడంతో పాటు కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ఓటర్లు గుర్తింపు కార్డులు అందించనున్నట్లు తెలిపారు.శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండల తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ మరియు సీనియర్ సిటిజన్లను సత్కరించి నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తహశీల్దార్‌లు ద్వారకానాథ్‌రెడ్డి, యర్రంరెడ్డి సుధీర్‌రెడ్డిలు తెలిపారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గం-168లో మొత్తం 293 పోలింగ్ కేంద్రాలు ఉండగా నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట ప్రాంతాల్లో మొత్తం 2,43,197లక్షలు మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,17,635మంది ఉండగా, మహిళలు 1,25,546, ఇతరులు 16మంది ఉన్నట్లు ప్రకటించారు. కాగ సర్వీస్ ఓటర్లు(మిలిటరీలో పనిచేసేవాళ్ళు) 95మంది ఉండగా వీరిలో ఓ మహిళ ఉంది. ఇక ఓవర్సీస్ ఓటర్లు(విదేశాల్లో ఉన్నవారి ఓటర్లు) 21 మంది ఉండగా వీరిలో ఇద్దరు మహిళలు, 19మంది పురుషుల ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో శ్రీకాళహస్తి రూరల్ పరిధిలో మొత్తం 43,805మంది ఉండగా వీరిలో పురుషులు 21,368, మహిళలు 22,437మంది ఉండగా, అర్బన్ పరిధిలో మొత్తం 62,687 మంది ఉండగా వీరిలో పురుషులు 30,204మంది, మహిళలు 32,477మంది, ఇతరులు 6 మంది ఓటర్లు ఉన్నారు. రేణిగుంటలో మొత్తం 60,577మంది ఉండగా వీరిలో పురుషులు 29,135మంది, మహిళా ఓటర్లు 31,439, ఇతరులు 3 ఉన్నారు. ఏర్పేడు మండలంలో మొత్తం 43,484మంది ఉండగా వీరిలో పురుషులు 21,131మంది, మహిళలు 22,346మంది, ఇతరులు 7మంది ఉన్నారు. తొట్టంబేడు మండలంలో మొత్తం 32,644 ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 15,797మంది, మహిళలు 16,847మంది ఉన్నారన్నారు.